క్లుప్తంగా

బాలత్రిపుర సుందరి ఆలయానికి రంగులు

బోట్‌క్లబ్: బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయానికి దాతల సహకారంతో రంగులు వేస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ, ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం రంగులు వేసేందుకు ముహూర్తం ఖరారు చేశారు. ఆలయంలో రంగులు వెలసిపోవడంతో దాతల సహకారంతో ఆలయం మొత్తం రంగులు వేయనున్నట్టు చెప్పారు. రంగులు వేసేందుకు ముందుకు వచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రాజశ్యామల హోమం



రాజశ్యామల హోమం నిర్వహిస్తున్న పుసులూరి మణిశర్మ

బోట్‌క్లబ్: వేద విజ్ఞాన ప్రతిష్ఠానం ఆధ్వర్యంలో స్థానిక రామారావుపేటలో సోమవారం రాజశ్యామల హోమాన్ని ప్రతిష్ఠానం ఉపాధ్యక్షుడు పుసులూరి మణిశర్మ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. వేద విజ్ఞాన ప్రతిష్ఠానంలో ప్రతినెలా విశేష తిథుల్లో హోమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రజలందరూ సుఖశాంతులతో జీవించడమే కాక, వారి సమస్యలు పరిష్కారమయ్యేందుకు ఇటువంటి హోమాది కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ప్రతిష్ఠానం వ్యవస్థాపకులు చెరుకుపల్లి లక్ష్మీనృసింహశర్మను స్మరించుకుంటూ ఈ విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రతిష్ఠానం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వినియోగదారులకు అనుకూలంగా చట్టాలు



సదస్సులో మాట్లాడుతున్న కొమ్మూరి శ్రీనివాసరావు

కాకినాడ రూరల్: వినియోగదారులకు అనుకూలంగా చట్టాలున్నాయని జిల్లా వినియోగదారుల ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యుడు కొమ్మూరి శ్రీనివాసరావు అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లో సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ఏ వస్తువు కొన్నా లేదా నగదు చెల్లించి ఏ సేవ పొందినా, వాటిలో లోపాలుంటే మన ప్రాంతంలోనే ఫిర్యాదు చేసే అవకాశాన్ని చట్టం కల్పించిందన్నారు. ఫిర్యాదు చేసిన 120 రోజుల్లోగా పరిష్కారం లభిస్తుందని, 1915, 1800-14000కు నేరుగా ఫోన్‌కాల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాఘవరావు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

కరప: తదేకం ఫౌండేషన్ సహకారంతో గ్రామంలో సోమవారం జేఏస్పీ నాయకుడు వైవీవీ సత్యనారాయణ గృహంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు పంతం నానాజీ ప్రారంభించారు. తదేకం ఫౌండేషన్ ప్రతినిధి చవ్వాకుల సందీప్, పార్టీ నాయకులు భోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, పి.ప్రసాద్, ఎస్.భవానీశంకర్, పి.పవన్‌కుమార్, జె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

కాకినాడ సిటీ: తమ డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారం 14వ రోజు చేరింది. అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం తక్షణం నెరవేర్చాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ప్రతినిధులు చంద్రావతి, జి రమణమ్మ, జ్యోతి, రామ, విజయ తదితరులు పాల్గొన్నారు.

కరప: వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. మండలంలోని అంగన్‌వాడీలు, ఆయాలు కరపలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు చేస్తున్నారు.

ఎమ్మెల్యే, జెడ్పీటీసీలపై అనుచిత వ్యాఖ్యలు తగవు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మహిళా నేతలు భవాని, ప్రియదర్శిని

కాకినాడ రూరల్: తమ నాయకులు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు, ఆరోపణలు చేస్తే సహించేది లేదని సర్పవరం గ్రామానికి చెందిన పుల్ల శ్రీనును వైఎస్సార్ సీపీ మహిళా నేతలు భవాని, ప్రియదర్శిని హెచ్చరించారు. ఇటీవల కాలంలో పదే పదే ఎమ్మెల్యే, జెడ్పీటీసీపై పుల్ల శ్రీను చేస్తున్న ఆరోపణలను బీసీ మహిళా నేత భవాని, ఎస్సీ లీగల్‌సెల్ సభ్యురాలు ప్రియదర్శిని సోమవారం మీడియా సమావేశంలో ఖండించారు, తిన్నింటి వాసాలు లెక్కపెట్టినట్టు మొన్నటి వరకు వైఎస్సార్ సీపీలో ఉండి, ఇప్పుడు వేరే పార్టీలోకి చేరి ఇష్టానుసారంగా మాట్లాడున్నారని విమర్శించారు.



తెలుగు బాప్టిస్టు చర్చిలో క్రిస్మస్ ఆరాధనలో ఆలపిస్తున్న ప్రత్యేక గీతాలు



యండమూరు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



రిజర్వు పోలీస్ యూనియన్ బాప్టిస్టు చర్చిలో క్రిస్మస్ సందేశం ఇస్తున్న అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) శ్రీనివాస్, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి



చర్చిలో నృత్యాలు చేస్తున్న బాలికలు

క్రీస్తు జీవితం శాంతి సందేశం

- భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు
- ప్రత్యేక ఆరాధనల్లో పాల్గొన్న విశ్వాసులు
- వేషధారణలతో ఆకట్టుకున్న చిన్నారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): లోకానికి శాంతి సందేశమిచ్చిన క్రీస్తు.. ప్రతిఒక్కరికీ ప్రేమ, దయ పంచారని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం నగరంలోని పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవ సోదర, సోదరీమణులు, చిన్నారులు, పెద్దలు ఉదయం జరిగే ఆరాధనలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆరాధనల్లో అతిథులు క్రీస్తు సందేశాన్ని అందించారు. క్రిస్మస్ ప్రత్యేక గీతాలను ఆలపించారు. క్రైస్తవులు ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. కొన్ని చర్చిల్లో పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. అలాగే క్యాండిల్ సర్వీస్ నిర్వహించి, ప్రేమ విందులో పాల్గొన్నారు.

క్రిస్మస్ పండగను పురస్కరించుకుని గాంధీనగర్ హౌస్ ఆఫ్ ప్రేయర్‌లో చర్చి వ్యవస్థాపకులు పాస్టర్ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో పాస్టర్ మోజెస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఈ వేడుకల్లో పాల్గొని క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. రామారావుపేట లూథరన్ చర్చిలో పాస్టర్ ఏ.శామ్యూల్‌రాజు, రిజర్వులైన్స్ పోలీస్ యూనియన్ బాప్టిస్టు చర్చిలో పాస్టర్ ఎం.చంద్రపాల్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి అతిథులుగా విచ్చేసి, క్రిస్మస్ కేక్‌ను కట్‌చేశారు. గ్రేగ్ చర్చి పాస్టర్ వరప్రసాద్, షాలేమ్ ప్రేయర్ హౌస్‌లో పాస్టర్ డి.శామ్యూల్ విక్టర్, బెరాకా బ్లెస్సింగ్స్ చర్చిలో పాస్టర్ జోసఫ్‌బెన్ని, కలెక్టరేట్ వెనుక గల సిటీ టేబర్నికల్ చర్చిలో పాస్టర్ హెన్రీ ఆధ్వర్యంలో క్రిస్మస్ ప్రత్యేక ఆరాధనలు జరిగాయి. గాంధీనగర్ ఎల్విన్‌పేటలోని తెలుగు బాప్టిస్టు చర్చిలో పాస్టర్ బీవీ రాజు, సంఘ అధ్యక్షుడు రెవరెండ్ పీడీ అరుణకుమార్, కార్యదర్శి డాక్టర్ పి.జాన్ వీకే గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరాధనలో క్వయర్ వారు ప్రత్యేక క్రిస్మస్ గీతాలను ఆలపించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేసి, క్రిస్మస్ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. క్రిస్మస్ ప్రత్యేక ఆరాధనలో దైవ సందేశాన్ని ప్రత్యేక ఆహ్వానితులు అందించారు.



గాంధీనగర్ హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చిలో క్రిస్మస్ ఆరాధనలో పాల్గొన్న క్రైస్తవులు

మిన్నంటిన క్రిస్మస్ వేడుకలు

కరప: మానవులకు పాపపరిహారం చేసి, రక్షించేందుకే బాల ఏసుగా పశువులపాకలో జన్మించాడని క్రైస్తవుల విశ్వాసం. క్రిస్మస్ సందర్భంగా వివిధ ప్రాంతాల్లోని చర్చిల్లో సోమవారం ఆరాధన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామగ్రామాన ఉన్న చర్చిలను ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. సంఘ కాపరుల ఆధ్వర్యంలో క్రైస్తవులు, ప్రజాప్రతినిధులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నారులు కొరియోగ్రఫీ, క్రిస్మస్‌తాతల వేషధారణలో తిరుగుతూ, ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చర్చిల్లో అందంగా అలంకరించిన క్రిస్మస్ ట్రీలు అందరినీ ఆకట్టుకున్నాయి. పలు చర్చిల్లో క్రీస్తు పుట్టుకను వివరించే చిత్రపటాలు ఆకర్షణీయంగా నిలిచాయి. కరపలోని ఫెయిత్ గాస్పెల్ చర్చిలో బిషప్ డాక్టర్ కె.అబ్రహం సామ్యూల్, శాంతి బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ డి.జయప్రకాష్, చర్చి ఆఫ్ క్రైస్ట్ పాస్టర్ డాక్టర్ పి.సామ్యూల్‌రాజు ఆధ్వర్యంలో ప్రార్థనలు చేసి, క్రిస్మస్ సందేశం వినిపించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, సాదే లోహిదాస్ కుమార్ ప్రార్థనలు చేసి, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. క్రీస్తు భక్తులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. చిన్నారులు పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. పేదలకు, వితంతువులకు బిషప్ అబ్రహం సామ్యూలు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. వేళంగి క్రైస్ట్‌చాప్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ పి.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. యండమూరు గాస్పెల్ బాప్టిస్ట్ చర్చిలో రెవరెండ్ ఐ.జాన్ సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, క్రిస్మస్ సందేశం వినిపించారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

పేదలకు దుస్తులు పంపిణీ

కాకినాడ రూరల్: క్రిస్మస్ పండగను క్రైస్తవులు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. క్రీస్తు రాకను ఆహ్వానిస్తూ ఆదివారం రాత్రి నుంచి చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాకినాడ రూరల్‌లో పలు గ్రామాల్లోని ప్రార్థన మందిరాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రిస్మస్ కేక్ కట్ చేసి, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ప్రత్యేక కార్యక్రమాలతో సందడి చేశారు.



యండమూరు చర్చిలో దుస్తులు అందజేస్తున్న పాస్టర్ జాన్ సూర్యప్రకాష్

తూరంగి, కొవ్వూరుల్లో..

కాకినాడ సిటీ: క్రైస్తవ లోకానికి ఆరాధనీయమైన క్రీస్తు జన్మదినమే క్రిస్మస్ అని పలువురు ప్రతినిధులు పేర్కొన్నారు. క్రిస్మస్ సందర్భంగా కాకినాడ రూరల్ మండలంలోని తూరంగి, కొవ్వూరు, పగడాలపేట, డ్రైవర్స్‌కాలనీ, ఏఎస్ఆర్ కాలనీ, శివకృష్ణాకాలనీ, ఈశ్వర్‌కాలనీ, బుల్లబ్బాయిరెడ్డి నగర్, మహాలక్ష్మినగర్ తదితర ప్రాంతాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించిన అనంతరం విందు కార్యక్రమాలు చేశారు. కొన్ని చర్చిల్లో నిర్వహించిన భక్తిపూర్వక సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న యువకులు, బాలబాలికలకు బహుమతి ప్రదానం జరిగింది.

ఆంధ్రాకు సీఎంగా జగనే ఉండాలి

సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అందరూ బాగుండాలి.. ఆంధ్రాకు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలి అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి అన్నారు. సోమవారం క్రిస్మస్ సందర్భంగా కాకినాడ సిటీ, రూరల్ పరిధిలోని చర్చిలను సందర్శించి, క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. గాంధీనగర్‌లోని హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చిలో పాస్టర్ విజయ్‌కుమార్‌తో కలసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. పాస్టర్ ప్రశాంత్‌కు కేక్‌ను తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. యావత్ మానవాళికి శాంతి సందేశం ఇచ్చిన ప్రభువు ఏసు స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. భావితరాలకు ఏసు త్యాగాన్ని, ప్రేమను, దయను తెలియజేయాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. ప్రపంచంలోని మొత్తం దేశాలు భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ పండగను జరుపుకొంటున్నారని చెప్పారు. కాకినాడ సిటీ నియోజకవర్గ ప్రజలకు క్రీస్తు ఆశీస్సులు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. జగన్నాథపురంలోని నర్సీ ప్రేయర్ హౌస్ చర్చి, దుమ్ములపేటలోని మోన అబ్రహాం చర్చి, 46వ వార్డు మహాత్మా స్ట్రీట్‌లోని బాప్టిస్ట్ క్రైస్ట్ చర్చ్, 30 వార్డులోని బెరాకా బ్లెస్సింగ్స్ చర్చిలను ద్వారంపూడి సందర్శించి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి, ప్రత్యేక ఆరాధానల్లో పాల్గొన్నారు. ఆయన వెంట కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి కుమార్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న సాగర్, జిల్లా ఐటీ కోఆర్డినేటర్ కృష్ణప్రియ, అనంత, గద్దెపల్లి దానమ్మ, దాసు, పెంకె రవి కుమార్, నాయకులు బాదం మధు తదితరులు ఉన్నారు.



గాంధీనగర్ హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చిలో పాస్టర్ విజయ్‌కుమార్‌తో కలసి క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

సర్వలోక రక్షకుడు ఏసు ప్రభువు

ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కరప: మానవాళి ఏవిధంగా మసలుకోవాలో ప్రపంచానికి చాటిచెప్పిన ఏసు ప్రభువు సర్వలోక రక్షకుడని, తన జీవితాన్ని సందేశాత్మకంగా చూపిన మహాత్ముడని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు అన్నారు. ప్రభువు చూపిన బాటలో ప్రతిఒక్కరూ నడుస్తూ, ఎదుటి మనిషిపై ప్రేమ, కరుణ చూపాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తూ, ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూర్చాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరింతగా సంక్షేమ పాలన సాగించేందుకు వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలన్నారు. క్రిస్మస్ ఆరాధన వేడుకల్లో భాగంగా సోమవారం ఆయన గొడ్డటిపాలెంలోని ఫెయిత్ గాస్పెల్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ కె.డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. పాస్టర్ డేవిడ్‌రాజు ప్రత్యేక ప్రార్థనలు చేసి, క్రిస్మస్ సందేశం వినిపించారు. ఎమ్మెల్యే కన్నబాబు, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావును పాస్టర్ డేవిడ్‌రాజు సత్కరించారు. గొడ్డటిపాలెం, అరట్లకట్ట సర్పంచ్‌లు వాసంశెట్టి శ్రీనుబాబు, గోపి సత్యవేణి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సింగినేని చినబాబు తదితరులు పాల్గొన్నారు.



గొడ్డటిపాలెం చర్చిలో ఎమ్మెల్యే కన్నబాబును సత్కరిస్తున్న పాస్టర్ డేవిడ్‌రాజు

కూర్మావతారంలో సీతారామస్వామి



కూర్మావతారంలో దర్శనమిచ్చిన సీతారామస్వామి

బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న సీతారామస్వామి ఆలయంలో రెండో రోజు సోమవారం స్వామివారు కూర్మావతారంలో భక్తులను దర్శనమిచ్చారు. స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఉదయం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ప్రారంభం కానున్న కల్యాణ మండపం పనులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామంలోని రాయుడుపాలెంలో కాపు కల్యాణ మండపం నిర్మాణ పనులు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చొరవతో తిరిగి ప్రారంభం కానున్నాయి. ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న కాపు కల్యాణ మండపం నిర్మాణాన్ని పూర్తి చేయాలని శ్రీబాల గణపతి కాపు సేవా సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు ఇటీవల విజ్ఞప్తి చేశారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఆయన నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో కాపు సంఘ నేతలతో కలసి మండల ఇంజనీరు వాసుదేవరావు సోమవారం అసంపూర్తి భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీబాల గణపతి కాపు కల్యాణ మండపం జనవరి నెలాఖరులోగా పూర్తి చేస్తామని ప్రతినిధులు లింగం రవి, ఉప్పులూరి బుల్లయ్య, వెజ్జపురెడ్డి ఏసుబాబు, గాదె చక్రరావు తదితరులు మీడియాకు వెల్లడించారు. మండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే కన్నబాబుకు వారు ధన్యవాదాలు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం తనవంతుగా రూ.25 వేల చెక్కును వైఎస్సార్ సీపీ నేత, సంఘ గౌరవాధ్యక్షుడు లింగం రవి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘ సభ్యులు కామిరెడ్డి బాబూరావు, చొడిశెట్టి నాగేశ్వరరావు, సత్యనారాయణ, మేడిబోయిన రామారావు, రామకృష్ణ, పేరాబత్తుల ప్రసాద్, గొల్లపల్లి సత్తిబాబు, పైల సూర్యనారాయణ, టంకాల కామేశ్వరరావు, గాదే బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



రాయుడుపాలెంలో అసంపూర్తి కాపు కల్యాణ మండపాన్ని వాసుదేవరావుతో కలిసి పరిశీలిస్తున్న కాపు నేతలు

ఉనికి కోసం శశిధర్ పాట్లు

- ద్వారంపూడిపై విమర్శలు తగవు
- కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి



సమావేశంలో కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితరులు

కాకినాడ: రాజకీయాల్లో తన ఉనికిని చాటుకోవడానికే జనసేన సిటీ ఇన్‌చార్జ్, పీఏసీ సభ్యుడు ముత్తా శశిధర్ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఇతర నాయకులతో కలిసి ఆమె విలేకర్లతో మాట్లాడారు. కాకినాడలో ఏ సమస్య ఎదురైనా ఎమ్మెల్యే ద్వారంపూడికి ముడిపెట్టి ఆరోపణలు చేయడం టీడీపీ, జనసేన పార్టీలకు పరిపాటిగా మారిందన్నారు. ఓ పెట్రోలు బంక్ వివాదంలో ద్వారంపూడిపై ముత్తా శశిధర్ చేస్తున్న విమర్శలు సత్యదూరమన్నారు. ×ముత్తా శశిధర్‌కి అప్పుడే నిద్రలో నుంచి లేచి వచ్చి వాస్తవాలు ఏమిటో తెలుసుకోకుండా విమర్శలు చేస్తున్నట్టుగా అనిపిస్తోందన్నారు. టీడీపీ, జనసేన నేతలకు తరచూ ద్వారంపూడిపై నిందలు వేయడం అలవాటుగా మారిపోయింది.. గతంలో కూడా టీడీపీ అనేక ఆరోపణలు చేసి ఏ ఒక్కటీ నిరూపించలేకపోయింది.. ఇప్పుడు తెలుగుదేశంతో జతకట్టిన జనసేన కూడా అదేబాట పట్టిందంటూ ధ్వజమెత్తారు. మాదక ద్రవ్యాల వ్యాపారాలంటూ తరచూ విమర్శలు చేస్తున్న టీడీపీ, జనసేన తీరుపై ఆమె స్పందిస్తూ.. ముత్తా శశిధర్ తరచూ ముంబై వెళ్తున్నారు, ఆయన కూడా డ్రగ్స్ వ్యాపారం చేసేందుకే వెళ్తున్నారా? అంటూ ఆమె గట్టిగా నిలదీశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయంగా నేనున్నానంటూ చెప్పుకోవడానికే ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డిని విమర్శిస్తున్నారని, ఈ విధానాన్ని మానుకోవాలని ఆమె హితవు పలికారు. ముఖ్యంగా కేసులకు సైతం భయపడనంటూ శశిధర్ చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందిస్తూ, కేసులంటే జనసేన పార్టీ తీసుకునే సూట్‌కేసులు కాదని, కేవలం ఎమ్మెల్యేను విమర్శిస్తే ప్రజల్లో గుర్తింపు వస్తుందని, ఎమ్మెల్యేను విమర్శించి ఇమేజ్‌ను పెంచుకోవాలని చూస్తున్నారని, ఆ తీరు మార్చుకోవాలని మండిపడ్డారు. ముత్తా శశిధర్ వ్యాఖ్యలు చూసి జనం నవ్వుకుంటున్నారన్నారు. ఆయనను ఒక పార్ట్‌టైమ్ పొలిటీషియన్‌గా అభివర్ణించారు. విలేకర్ల సమావేశంలో జిల్లా ఐటీసెల్ చైర్మన్ బీర కృష్ణప్రియ, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, కర్రి శైలజ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కర్రి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి పాలన సువర్ణాధ్యాయం

జయంతి సభలో బీజేపీ నేతలు

కాకినాడ రూరల్: ప్రధానిగా ఏబీ వాజ్‌పేయి పాలన సువర్ణాధ్యాయమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు అన్నారు. వాజ్‌పేయి జయంతిని నార్త్ మండల అధ్యక్షుడు గొతు చిన్నా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి నేతలు సూర్యనారాయణరాజు, ముత్తా నవీన్‌కృష్ణ, రంబాల వెంకటేశ్వరరావు, కవికొండల భీమశేఖర్, అనపర్తి వెంకటేష్, తమ్మలపల్లి నాని, జగన్నాథం, త్రినాథకుమార్, వీరభద్రరాజు తదితరులు నివాళులర్పించారు.

తనదైన ముద్ర

బోట్‌క్లబ్: ఫోర్‌లైన్ హైవే నిర్మాణం, పొఖ్రాన్ అణు పరీక్షలు, కార్గిల్ యుద్ధం తదితర వాటిలో వాజ్‌పేయి తనదైన ముద్ర వేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో వాజ్‌పేయి జయంతి నిర్వహించారు. వాజ్‌పేయి సేవలను దేశ ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకుంటారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు పెండెం సత్యనారాయణ, మొసలగంటి సురేష్, సత్యానందం, నాగు, పవన్ తదితరులు పాల్గొన్నారు.



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

నడకుదురులో..

కరప: మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతిని నడకుదురు గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్ ఆధ్వర్యంలో జరిగింది. వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించి, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పొగమంచు ఇక్కట్లు

ప్రత్తిపాడు: గ్రామాల్లో ప్రతిరోజూ ఉదయం పొగ మంచు కురుస్తోంది. మంచు ఎక్కువగా ఉండడంతో రోడ్లపై వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి ఏడు గంటల నుంచి ఉదయం ఎనిమిది వరకూ చలి తీవ్రత తగ్గడం లేదు. గత రెండు రోజులుగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రత్తిపాడు మండలంలో సోమవారం 17 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8.30 గంటలు దాటినా సూర్యుడి జాడ కనిపించడం లేదు. దీంతో ప్రజలు స్వెట్టర్లు, జర్కిన్లు వేసుకునే ఇంటి నుంచి బయటకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక ఉదయాన్నే పనుల కోసం వెళ్లే వారు చలి తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారు.



పొలాలను కమ్మేసిన పొగమంచు

క్రీడాస్ఫూర్తిని చాటేలా 'ఆడుదాం ఆంధ్రా'

ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని క్రీడాస్ఫూర్తిని చాటేలా పటిష్ఠంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పండగ ఏర్పాట్లను కమిషనర్ ఆయా అధికారులతో కలిసి సోమవారం సాయంత్రం పరిశీలించారు. స్థానిక ఆనంద భారతి గ్రౌండ్స్ ఈ క్రీడా పోటీలను జిల్లా కలెక్టర్, కాకినాడ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డాక్టర్ కృతికా శుక్లా, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి ప్రారంభిస్తారని కమిషనర్ చెప్పారు. ఐదు క్రీడాంశాల్లో జరిగే ఈ ఆడుదాం ఆంధ్రా పోటీలకు కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో సుమారు 23 వేల మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారన్నారు. సచివాలయాల పరిధిలో జరిగే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ, ఆ తర్వాత జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులకు క్రీడా పరికరాలతో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందిస్తామన్నారు. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీలకు హాజరుకావాలని సూచించారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్ కమిషనర్ వెంట ఉన్నారు.



ఆడుదాం ఆంధ్రా క్రీడల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు